సాక్షి
అనంతపురం
ఆదివారం । 8 । జూన్ । 2025



చీనీ టన్ను రూ.32,400

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32,400 పలికాయి.



ఫీల్డ్ అసిస్టెంట్లకే 'ఉపాధి'

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు వరంగా మారింది. ప్రజా ధనాన్ని కాపాడాల్సిన ఉద్యోగులే నిధులను దోచేస్తున్నారు. 10లో

గరిష్టం/కనిష్టం
39.5°/22.6°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

'షైనింగ్ స్టార్స్'కు ఏర్పాట్లు చేయండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం



అనంతపురం అర్బన్: 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమాన్ని ఈ నెల 9న నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'షైనింగ్ స్టార్స్' కింద 184 మంది పదో తరగతి, 35 మంది ఇంటర్ విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. వీరందరికీ మెడల్, సర్టిఫికెట్, రూ.20 వేల నగదు అందజేయాలన్నారు. కార్యక్రమ నిర్వహణకు వేదిక గుర్తించి ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈనెల 12కు ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు కొత్తగా అనుమతులు మంజూరు చేసి ప్రారంభోత్సవాలు చేపట్టాలన్నారు.

న్యూరో సర్జరీ విభాగానికి నాలుగు పీజీ సీట్లు



అనంతపురం కార్పొరేషన్: నగరంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని న్యూరో సర్జరీ విభాగానికి నాలుగు పీజీ సీట్లు మంజూరు చేస్తూ ఎన్ఎంసీ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు హర్షం వ్యక్తం చేశారు. రోగులకు మరింత నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. ఈ సంవత్సరం నుంచే పీజీ సీట్లు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ నెల నుంచి విద్యార్థులు చేరతారన్నారు. నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందన్నారు. రానున్న ఏడాది పీడియాట్రిక్ సర్జరీలోనూ పీజీ సీట్లు వస్తాయని ప్రిన్సిపాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతో వైద్య కళాశాల ఏ గ్రేడ్ పరిధిలోకి వస్తుందని, ఆ దిశగా అంకితభావంతో పని చేస్తామని తెలిపారు. కాగా, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, అప్పటి స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో వైద్య కళాశాల బలోపేతమైంది. ఏళ్ల తరబడి ఆచరణకు నోచుకుని సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. న్యూరో, కార్డియోలతో కలుపుకుని 7 స్పెషాలిటీ వైద్య సేవలు ప్రజలకు అందేలా చర్యలు చేపట్టారు. దీంతో పాటు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు చొరవతో వైద్య కళాశాలకు మహర్దశ పట్టింది. ఇప్పటి వరకు 120కి పైగా పీజీ సీట్లు వచ్చాయి.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. మొదటి సంవత్సరంలో అనంతపురం జిల్లా రాష్ట్రంలో 14వ స్థానంలో నిలవగా, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 7వ స్థానం దక్కించుకుంది. మొదటి సంవత్సరం ఫలితాల్లో 7,404 మంది విద్యార్థులకు గాను 3,336 మంది (45 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 4,545 మంది విద్యార్థులకు గాను 3,128 మంది (69 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ ఫలితాలకు సంబంధించి మొదటి సంవత్సరంలో 925 మంది విద్యార్థులకు గాను 375 మంది (41 శాతం) ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 21వ స్థానంలో నిలవగా, ద్వితీయ సంవత్సరంలో 428 మందికి గాను 275 మంది 64 శాతం ఉత్తీర్ణతతో 14వ స్థానంలో నిలిచింది.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



అనంతపురంలోని ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఉరవకొండలో..

బక్రీదు పర్వదినాన్ని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు బక్రీదు పర్వదిన విశిష్టతను తెలియజేశారు. చిన్నారులు, పెద్దలు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.

– అనంతపురం కల్చరల్ /సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



పట్టపగలే దోపిడీ

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజు నుంచి 'తెలుగు తమ్ముళ్లు' సహజ వనరులను కొల్లగొడుతున్నారు. అధికారమే అనుమతులుగా భావించి ప్రభుత్వానికి పైసా పన్ను చెల్లించకుండా దోచుకుంటున్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబం పేరు చెప్పుకుంటూ దందా సాగిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, భూగర్భ గనులశాఖ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలున్నాయి. కింది స్థాయి ఉద్యోగులకు మామూళ్లు ముట్ట చెబుతున్నట్లు తెలిసింది.

పూలకుంట టు అనంతపురం

- యథేచ్ఛగా ఎర్రమట్టి అక్రమ రవాణా
- రోజూ రూ. లక్షకు పైగా ఆదాయం
- ప్రధాన సూత్రధారి కృష్ణమరెడ్డిపల్లి వాసి
- ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబం పేరు చెప్పుకుంటూ దందా
- మామూళ్ల మత్తులో రెవెన్యూ, పోలీస్, భూగర్భ గనులశాఖ అధికారులు



పూలకుంట సమీపంలోని గుట్టపై ఎర్రమట్టిని తవ్వేసిన దృశ్యం



పూలకుంట గ్రామంలో వెళ్తున్న ఎర్రమట్టి టిప్పర్

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కృష్ణమరెడ్డిపల్లి సమీపంలోని పెద్దకొండ, ఆలమూరు జగనన్న కాలనీ పక్కన ఉన్న ఎర్ర కొండ, నరసనాయనికుంట గ్రామ సమీపంలోని అంజనేయస్వామి ధ్వజస్తంభం గుట్ట (తాటిచెర్ల పొలం)ల్లో టీడీపీ నాయకుల ఎర్ర మట్టి అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇప్పటికే కొండ గుట్టలను నామరూపాల్లేకుండా చేసి కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారు. తాజాగా పూలకుంట సమీపంలోని దుర్గం గ్రామానికి వెళ్లేదారిలో ఉన్న గుట్టను కొల్లగొడుతున్నారు. పూలకుంట ఊరి చరిత్రలో ఈ గుట్ట నుంచి ఇప్పటిదాకా కనీసం ఒక్క రాయిని కూడా ఎవరూ తరలించలేదు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చిన అనతి కాలంలోనే ఎకరాల విస్తీర్ణంలో పెద్దపెద్ద గుంతలు తవ్వి వందలాది టిప్పర్ల మట్టిని తరలించారు.

'పెద్దకొండ'ను కొల్లగొట్టారు..

ఇప్పటికే కృష్ణంరెడ్డిపల్లి సమీపంలోని చియ్యేడు పొలం 231 సర్వే నంబరులోని 'పెద్దకొండ'ను కొల్లగొట్టారు. ఇక్కడి నుంచి రోజూ 80–90 ట్రిప్పుల దాకా మట్టిని తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇందులో కృష్ణమరెడ్డిపల్లికి చెందిన తిరుపాలు, అనంతయ్య కీలకంగా వ్యవహరించినట్లు ఆ ప్రాంతమంతా కోడై కూస్తోంది. ఈ కొండతో పాటు చియ్యేడు పాఠశాల వద్ద, దర్గాకు వెళ్లేదారిలోనూ పెద్దపెద్ద గుంతలు పెట్టారు. చూస్తేనే భయపడేలా ఈ గుంతలు కనిపిస్తాయి. పత్రికల్లో వరుస కథనాలు రావడంతో ఇక్కడ తాత్కాలికంగా మట్టి తవ్వకాలకు బ్రేక్ వేశారు.

తాజాగా పూలకుంట గుట్టపై కన్ను..

మట్టి తినడంలో ఆరితేరిన 'తెలుగు తమ్ముళ్లు' ఇటీవల పూలకుంట గుట్టపై కన్నేశారు. ఇక్కడి నుంచి రోజూ పట్టపగలే మట్టిని తరలిస్తున్నారు. నిత్యం లక్ష రూపాయల వరకు జేబుల్లోకి వేసుకుంటున్నట్లు తెలిసింది. కృష్ణమరెడ్డిపల్లికి చెందిన తిరుపాలు ఇందులో సూత్రధారి అనే ఆరోపణలున్నాయి. ఆయనతో పాటు వడ్డే రమేష్ అనే వ్యక్తి, పూలకుంట గ్రామానికి చెందిన వేమారెడ్డి జేసీబీలు పెట్టినట్లు తెలిసింది. పూలకుంట గ్రామంలో 12 అడుగుల రోడ్లున్నాయి. మట్టి టిప్పర్ల తాకిడితో ఎదురుగా ద్విచక్ర వాహనాలు వచ్చినా ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. భారీ లోడుతో వెళ్లే టిప్పర్లతో గ్రామస్తులు రోజూ ట్రాఫిక్ సమస్య ఎదుర్కొంటున్నారు. ఎమ్మెల్యే పరిటాల కుటుంబం పేరు చెబుతుండడంతో ప్రశ్నించడానికి స్థానికులు భయపడుతున్నారు. కాగా ఈ ప్రాంతంలో వీఆర్ఏ పాత్రపై పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమదందా వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లి.. వీఆర్ఏను అప్రమత్తం చేసిన ప్రతిసారీ ఆయనే ముందుగా అక్రమార్కులకు ఉప్పందిస్తున్నాడని గ్రామస్తులు చెబుతున్నారు. పూలకుంటలో ఎర్రమట్టి దందాపై వివరణ కోరేందుకు భూగర్భ గనుల శాఖ డీడీ గ్రంధి వెంకటేశ్వర్లును ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు

గుంతకల్లు: జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు శనివారం గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జీఆర్‌పీ ఎస్పీ రాహుల్‌మీనా ఆదేశాల మేరకు ఎస్ఐ మహేంద్ర తన సిబ్బందితో వెళ్లి స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫాంలతో పాటు వెయిటింగ్ హాళ్లలో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లలో తనిఖీలు చేయడంతోపాటు ప్రయాణికుల నుంచి వేలి ముద్రలు సేకరించారు. అంతేకాకుండా పార్శిల్ కార్యాలయంలో వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్ఐ మహేంద్ర మాట్లాడుతూ గంజాయి, నిషేధిత పదార్థాల రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు అసాంఘిక శక్తుల ఆటకట్టించి ప్రయాణం సాఫీగా సాగేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు.

ఖరీఫ్‌కు 44 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో పంటల సాగుకు ఇబ్బంది లేకుండా అవసరమైన మేరకు ఎరువులు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయశాఖ జేడీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల ఎరువులు 44 వేల మెట్రిక్ టన్నులు ఉన్నట్లు పేర్కొన్నాయి. అందులో యూరియా 15,200 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3 వేల మెట్రిక్ టన్నులు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంవోపీ) 6,900 మెట్రిక్ టన్నులు, సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ) 2 వేల మెట్రిక్ టన్నులు, ఇతరత్రా 105 మెట్రిక్ టన్నులు ఉండగా.. అత్యధికంగా కాంప్లెక్స్ ఎరువులు 16,500 మెట్రిక్ టన్నులకు పైగా ఉన్నట్లు తెలిపాయి. ఇక ప్రైవేట్ డీలర్ల దగ్గర 28 వేల మెట్రిక్ టన్నులు, సొసైటీల్లో 550 మెట్రిక్ టన్నులు, ఆర్ఎస్‌కేల్లో 1,400 మెట్రిక్ టన్నులు, హోల్‌సేల్ డీలర్ల వద్ద 6,800 మెట్రిక్ టన్నులు, కంపెనీ గోదాముల్లో 2 వేల మెట్రిక్ టన్నులతో పాటు మార్క్‌ఫెడ్ దగ్గర బఫర్‌స్టాక్ కింద 4,700 మెట్రిక్ టన్నులకు పైగా ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించాయి. అలాగే నెలవారీ కోటా మేరకు వివిధ కంపెనీలు అన్ని రకాల ఎరువులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

దళిత ఎమ్మెల్యేల నోరు మూగబోయిందా?

- సభ్యసమాజం సిగ్గుపడేలా దళిత మైనర్ బాలికపై అత్యాచారం
- ఇంత జరిగినా దళిత ప్రజాప్రతినిధులు మిన్నకుండిపోవడం అన్యాయం
- ఎస్పీ గారూ.. నిష్పక్షపాతంగా విచారించండి
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్:'రామగిరి మండలంలోని గ్రామంలో దళిత మైనర్ బాలికపై అత్యాచార ఘటనలో వాస్తవాలు వెలుగులోకి వస్తోంటే ఇది అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం అమలవుతున్న రాష్ట్రమా... లేక రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతున్న దుర్మార్గపు ప్రపంచమా అనేది తెలియడం లేదు. ఇంత జరుగుతున్నా జిల్లాలోని దళిత ఎమ్మెల్యేలు, నాయకులు ఎందుకు మాట్లాడడం లేదో అర్థం కావడం లేదు. వారి నోరు మూగబోయిందా.. మాట గొంతుదాటి బయటకు రావడం లేదా' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగిరి మండలం పరిటాల కుటుంబం కబంధహస్తాల్లో ఉందన్నారు. బాలికపై అఘాయిత్యం జరిగిన రామగిరి మండలంలోని గ్రామం పరిటాల పెత్తనంతో 40 ఏళ్లగా ప్రజాస్వామ్యం చూడలేదన్నారు. 'అక్కడ పరిటాల వారు చెప్పిందే వేదం.చేసిందే శాసనం.అదే చట్టం' అన్నారు. గ్రామంలో పరిటాల రాజ్యాంగం అమలవుతోందన్నారు. ఆ గ్రామంలో సూడో నక్సలైట్లు, కిరాయి హత్యలు చేసేవారు, రౌడీషీటర్లంతా పరిటాల సైన్యమన్నారు. ఇలాంటి గ్రామంలో ఒక దుర్మార్గుడు మైనర్ బాలికను బెదిరించి లొంగదీసుకుని వీడియో తీసి... ఆ వీడియోను బయట పెడతానంటూ బెదిరించి బలత్కారం చేశాడన్నారు. తర్వాత బ్లాక్‌మెయిల్ చేసి 14 మంది ఆ బాలికపై అత్యాచారం చేశారన్నారు. చివరకు వీడియో తీసిన వాడి తండ్రి కూడా బాలికపై కన్నేసి బలాత్కరించాడని వాపోయారు. ఏడాదికాలంగా బాలికను చిత్రవధకు గురి చేశారన్నారు. ఆ బాలిక గర్భం దాల్చిన ఆర్నెల్ల తర్వాత ఆనోట, ఈనోట పడి 'సాక్షి' మీడియా ద్వారా బయట ప్రపంచానికి తెలిసిందన్నారు. వాస్తవాలు వెలుగులోకి వస్తుంటే సభ్యసమాజం సిగ్గుపడే విధంగా ఉందన్నారు. ఒక మహిళ ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గం, ఒక మహిళ ఎస్పీగా ఉన్న జిల్లాలో మైనర్ బాలికపై అత్యంత దారుణంగా నెలల తరబడి అత్యాచారం జరిగితే ఇప్పటిదాకా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. చీమ చిటుక్కుమన్నా పరిటాల కుటుంబానికి సమాచారం చేరవేసే గ్రామస్తులు ఇంతటి దారుణ ఘటన గురించి చెప్పకుండా ఉంటారా అనే అనుమానం వ్యక్తం చేశారు. కీచకుల మెడలో చెప్పుల హారాలు వేయించి ఊరేగించేలా చూడాలని కోరారు. రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్‌కు ఈ ఘటన తెలీకుండా ఉంటుందా అని ప్రశ్నించారు. మరి ఇన్ని రోజులు ఎందుకు బయట పెట్టలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసుపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, గోవిందరెడ్డి, పెన్నోబులేసు, ఆలమూరు ఓబులేసు, మీనుగ నాగరాజు, సాకే వెంకటేష్, విశ్వనాథరెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ప్రమోషన్లపై అనాసక్తి



పదోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరైన టీచర్లు

- పదోన్నతులు తీసుకునేందుకు ముందుకురాని ఎస్జీటీలు
- 44 'సోషల్' పోస్టులకు నలుగురే ఆసక్తి
- పీఎస్‌హెచ్‌ఎం పోస్టుల్లోనూ అదే తీరు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపాలిటీ, మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ల పోస్టులకు పదోన్నతులు తీసుకునేందుకు ఎస్జీటీలు ఆసక్తి చూపలేదు. వాస్తవానికి ఒక్కో పోస్టుకు ఇద్దరు చొప్పున సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచినా... చాలా సబ్జెక్టులకు ఒక్కరు కూడా హాజరుకాకపోవడం విశేషం. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయి శుక్రవారం సాయంత్రం మొదలైన పదోన్నతుల కౌన్సెలింగ్ శనివారం ఉదయం 10 గంటల వరకు సాగింది. ఇందులో జిల్లా పరిషత్ పాఠశాలలకు సంబంధించిన సోషల్ సబ్జెక్టులో 44 ఖాళీలుంటే కేవలం నలుగురే పదోన్నతి తీసుకున్నారు. అలాగే పీఎస్ హెచ్‌ఎం పోస్టులకు సంబంధించి కూడా 45 ఉంటే కేవలం ఐదుగురు విల్లింగ్ ఇచ్చారు. చాలా పోస్టులు మిగిలిపోవడంతో ఆర్జేడీ శామ్యూల్ రాష్ట్ర అధికారులతో మాట్లాడి స్పష్టత తీసుకున్నారు. ఆసక్తి ఉంటే వీరి తర్వాత వారిని కూడా పిలిచేలా అనుమతులు పొందారు. ఈ క్రమంలో ఆయా సబ్జెక్టులకు అర్హులైన ఎస్జీటీలకు ఎంఈఓల ద్వారా సమాచారం అందించి సాయంత్రం 4 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. సాయంత్రం 5.30కు ఆ రెండు కేడర్ పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించగా... సోషల్‌లో ఎస్సీ కోటాలో కొన్ని తప్ప తక్కిన అన్ని పోస్టులూ భర్తీ అయ్యాయి. పీఎస్‌హెచ్‌ఎం పోస్టులకు రాత్రి 11 గంటల సమయానికి 16 మంది పదోన్నతులు పొందారు.

బదిలీ అయిన ఎస్ఏల వివరాలు లేవట!


స్కూల్ అసిస్టెంట్ల కేడర్‌కు సంబంధించి అన్ని సబ్జెక్టుల్లోనూ తప్పనిసరి, రిక్వెస్ట్ బదిలీలు పూర్తయ్యాయి. ఉత్తర్వులు కూడా జనరేట్ అయ్యాయి. ఇవన్నీ శుక్రవారం తెల్లవారుజామునే పూర్తయ్యాయి. అయితే జిల్లాలో ఏ సబ్జెక్టులో ఎంతమంది బదిలీ అయ్యారనే సమాచారం శనివారం రాత్రి వరకు విద్యాశాఖ అధికారులు చెప్పకపోవడం విశేషం. ఈ వివరాలు ఇంకా తమకు రాలేదంటూ డీఈఓ చెప్పారు. కాగా స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లందరూ శనివారం రిలీవ్ అయ్యి ఆదివారం కొత్తస్థానాల్లో చేరాలనే ఆదేశాల్లో మార్పు చేశారు. పాతస్థానాల్లో ఆదివారం (నేడు) రిలీవ్ అయ్యి సోమవారం కొత్త స్కూళ్లల్లో చేరాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు ఎస్జీటీలకు వెబ్ ఆప్షన్లు

ఎస్జీ టీచర్ల బదిలీలకు ఆదివారం వెబ్ ఆప్షన్లు పెట్టుకోనున్నారు. మ్యానువల్‌గా కాకుండా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఎంఈఓల కార్యాలయాల్లో 10 కంప్యూటర్లు సిద్ధంగా ఉంచుకోవాలంటూ రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ఆయా మండలాల పరిధిలోని టీచర్లందరికీ అక్కడే వెబ్ ఆప్షన్లు పెట్టుకునే సదుపాయం కల్పించనున్నారు. ఎంఈఓ కార్యాలయాల్లో సరైన వసతి లేకపోతే సమీపంలోని స్కూల్‌లో ఏర్పాటు చేసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈక్రమంలో ఎంఈఓలందరూ అప్రమత్తమయ్యారు. మరోవైపు ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్ మ్యానువల్‌గా నిర్వహించాలంటూ ఆదివారం ఐక్య ఉపాధ్యాయ సంఘాల వేదిక డీఈఓ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చింది.

తారస్థాయికి దాహం కేకలు

- వారం రోజులుగా నిలిచిన సీపీడబ్ల్యూఎస్' నీటి సరఫరా
- గ్రామీణులకు తీవ్ర ఇక్కట్లు



పీఏబీఆర్ సమీపంలో ఏర్పాటైన శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్



ఉదిరిపికొండలో ద్విచక్ర వాహనంలో నీటిని తెచ్చుకుంటున్న దృశ్యం

కూడేరు: మండల పరిధిలోని పీఏబీఆర్ వద్ద ఏర్పాటైన శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్ నుంచి సీపీడబ్ల్యూఎస్ పథకం ద్వారా మంచినీటి సరఫరా 8 రోజులుగా ఆగిపోయింది. ప్రాజెక్ట్‌లో మోటర్లకు ఏర్పాటు చేసిన ప్యానెల్ బోర్డు పని చేయకుండా పోయింది. కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొలాలు, ఏటి వద్ద నుంచి ద్విచక్ర వాహనాలు, ఎద్దుల బండ్లు, ఆటోలు, ట్రాక్టర్లలో అవస్థలు పడుతూ నీటిని తెచ్చుకుంటున్నారు. కూడేరు మండలంలో సుమారు 42 వేల మందికి 'సీపీడబ్ల్యూఎస్' ద్వారా సరఫరా అయ్యే నీరే దిక్కు. ప్రాజెక్ట్ నుంచి పైపులైన్ ద్వారా రోజూ 3,053 కిలో లీటర్ల మంచి నీరు సరఫరా అవుతుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉరవకొండ మండలంలో కూడా కొన్ని గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నారు. దాహార్తి తీర్చే ప్రాజెక్ట్ నుంచి ఉన్నట్లుండి నీటి సరఫరా ఆగిపోవడంతో ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. గత్యంతరం లేక సోమవారం కూడేరుకు చెందిన మహిళలు ఖాళీ బిందెలతో జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. శుక్రవారం ముద్దలాపురంలో ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు కూడా జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. శనివారం ఉదిరిపికొండ మహిళలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. నీటి కోసం ప్రజలు ఆందోళన చేపడుతున్నా స్పందన కరువైంది. ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజు, సిబ్బంది

కూడేరు: ఎన్‌సీసీ నగర్ సమీపాన అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి పక్కన చెట్ల పొదల్లో శనివారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో సీఐ రాజు తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. ముఖం భాగాన్ని పురుగులు తినేయడంతో గుర్తుపట్టలేని విధంగా ఉంది. శరీరంపై ఎక్కడా గాయాలు లేవు, ఆమె చుట్టూ ఎలాంటి రక్తపు ఆనవాళ్లు లేవు. మహిళ ఎరుపు, తెలుపు రంగుతో కూడిన పంజాబీ డ్రస్ ధరించి ఉంది. 25–30 ఏళ్లలోపు వయసు ఉండొచ్చు. మహిళ మృతికి సంబంధించి పోలీసులకు ఘటనా స్థలంలో ఎలాంటి ఆధారాలూ లభించలేదు. మృతదేహాన్ని బట్టి చూస్తే నాలుగైదు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చని పోలీసులు అంచనాకు వచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. మహిళ ఆత్మహత్య చేసుకుందా? లేదా ఎక్కడైన హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడ పడేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఘర్షణలో యువకుడి మృతి


మృతి చెందిన యశ్వంత్

గార్లదిన్నె: ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందారు. పోలీసులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనకచెర్ల గ్రామానికి చెందిన దివాకర్, యశ్వంత్ శనివారం ఘర్షణ పడ్డారు. కోపోద్రిక్తుడైన దివాకర్ కట్టెతో దాడి చేయడంతో యశ్వంత్ (18) స్పృహతప్పి పడిపోయాడు. స్థానికుల సమాచారంతో 108 వాహన సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని యశ్వంత్‌ను అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి యశ్వంత్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘర్షణకు గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఫీల్డ్ అసిస్టెంట్లకే ఉపాధి

- అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీకి చెందిన గుగ్గిళ్ల కృష్ణారెడ్డి ఎంపీటీసీ సభ్యుడు. వీరి కుటుంబానికి ఉపాధి హామీ జాబ్ కార్డ్ (నంబర్ 11055) ఉంది. వీరు ఏ రోజూ ఉపాధి పనులకు వెళ్లరు. అయినా ఎంపీటీసీ సభ్యుడు, అతని భార్య ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చిలో 90 రోజులు, ఏప్రిల్, మే నెలల్లో 35 రోజుల పాటు హాజరైనట్లు మస్టర్లలో నమోదు చేశారు. 5 నెలల కాలంలో దాదాపు రూ.43 వేలు అక్రమంగా అందుకున్నారు. ఇక్కడ కొసమెరుపు ఏమిటంటే రాచానపల్లి పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ వీరి కుమారుడు కావడం!
- తన తల్లిదండ్రులు మంగమ్మ, సూర్యనారాయణలు పనులకు రాకున్నా అనంతపురం రూరల్ పంచాయతీ చిన్నంపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్ మస్టర్లలో వారి పేర్లు నమోదు చేస్తున్నాడు. అలాగే తన భార్య మమత, బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసే తన సోదరుడు ప్రవీణ్ సైతం పనులు చేస్తున్నట్లు హాజరు నమోదు చేస్తూ ప్రతి వారం రూ.వేలల్లో బిల్లులు డ్రా చేసుకుంటున్నాడు. గత నాలుగు నెలల కాలంలోనే రూ.లక్షకు పైగా జేబులో వేసుకున్నాడు.
- చిన్నంపల్లి యానిమేటర్ నందిని, ఆమె భర్త త్రిలోక్ పనులకు హాజరైన దాఖలాలే లేవు. అయినా వీరి పేరిట ప్రతి వారం ఫీల్డ్ అసిస్టెంట్ బిల్లులు చేసుకుంటున్నాడు. గ్రామంలోని విశ్రాంత జవాన్లు, పనులకు రాని దాదాపు 30–40 మంది పేరిట హాజరు నమోదు చేస్తూ బిల్లుల్లో సగం సగం పంచుకుంటూ ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారు.

- యానియేటర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల పేర్లపై బిల్లులు
- పనులకు రాకున్నా మస్టర్లలో కుటుంబీకుల పేర్లు
- రూ.లక్షలు దోచేస్తున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు


రాచానపల్లి ఎంపీటీసీ పనులకు వచ్చినట్లు నమోదు చేసిన రికార్డు

అనంతపురం టౌన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు వరంగా మారింది. ప్రజా ధనాన్ని కాపాడాల్సిన ఉద్యోగులే నిధులను దోచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు వారి కుటుంబ సభ్యుల పేర్లతోపాటు సింగిల్ జాబ్ కార్డులు ఏర్పాటు చేసుకొని ఉపాధి పనులకు రాకున్నా వచ్చినట్లు యాప్‌లో నమోదు చేసూ భారీగా నిధులను కొల్లగొట్టేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఇష్టారాజ్యంగా బిల్లులను డ్రా చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానికంగా ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నీకు సగం నాకు సగం..

'పనులకు రాకున్నా వచ్చినట్లు మస్టర్లలో హాజరు వేస్తాం. వచ్చిన బిల్లులో నీకు సగం నాకు సగం' అంటూ నిధులను స్వాహా చేస్తున్నట్లు తెలిసింది. దొంగ మస్టర్ల కారణంగా నిజంగా పనులకు హాజరైన కూలీలకు తక్కువ మొత్తంలో బిల్లులు పడుతున్నాయి. దీంతో కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారు. అనంతపురం రూరల్ మండలం చిన్నంపల్లి, బుక్కరాయసముద్రం మండలం రేగడికొత్తూరు, చెన్నంపల్లి గ్రామాల్లో పెద్ద ఎత్తున దొంగ మస్టర్లు సృష్టించి భారీగా ఉపాధి నిధులను దోచేస్తున్నట్లు సమాచారం.

చర్యలు తప్పవు

దొంగ మస్టర్లు సృష్టించి హాజరు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అనంతపురం రూరల్ మండలం చిన్నంపల్లి, రాచానపల్లి పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలిస్తాం. కూలీలతో వివరాలను తెలుసుకొని విచారణకు ఆదేశిస్తాం. అక్రమంగా డ్రా చేసిన బిల్లుల మొత్తాన్ని వెనక్కు రాబడతాం.
– సలీంబాషా, డ్వామా పీడీ, అనంతపురం

దర్శన టికెట్లపై అర్చకుల అభ్యంతరం


ఆలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అర్చకులు

గుత్తి: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి దర్శనానికి టికెట్ల విధానాన్ని ప్రవేశపెట్టడంపై అర్చకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దేవాలయం వద్ద శనివారం అర్చకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు, భక్తులు అధికంగా దైవ దర్శనానికి వస్తారన్నారు. కరువుకు నిలయమైన ఇలాంటి ప్రాంతంలో దైవ దర్శనానికి టికెట్ల విధానం అమలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అదీగాక అధికారులు ఏకపక్షంగా టికెట్ల విధానం అమలు చేయదానికి సిద్ధమయ్యారన్నారు. కనీసం అర్చకులు, గ్రామ పెద్దలను కూడా సంప్రదించలేదన్నారు. వెంటనే టికెట్ల విధానం యోచనను విరమించుకోవాలన్నారు.

కట్నం కోసం వేధింపులు

యాడికి: అదనపు కట్నం కోసం భర్త, మామ వేధిస్తున్నారని ఓ వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. చందన గ్రామానికి చెందిన దళవాయి ఐశ్వర్యకు నార్పల మండలం కేశేపల్లికి చెందిన కుళ్లాయప్ప కుమారుడు విష్ణువర్ధన్‌తో ఏడాది కిందట ప్రేమ వివాహమైంది. అయితే గత కొంతకాలంగా భర్తతో పాటు మామ కట్నం తేవాలని వేధిస్తుండటంతో భరించలేకపోయిన ఐశ్వర్య పుట్టింటికి వచ్చేసింది. బంధువుల ద్వారా పంచాయితీ చేసినా సమస్య పరిష్కారం కాకపోవడం, వేధింపులు మళ్లీ పెరగడంతో ఐశ్వర్య శనివారం యాడికి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నెత్తురోడిన రహదారి

- బొలెరోను ఢీకొన్న లారీ
- మహిళా కూలీ దుర్మరణం
- మరో 16 మందికి గాయాలు
- వీరిలో ఇద్దరి పరిస్థితి విషమం


మృతి చెందిన మంగమ్మ



రోడ్డు ప్రమాదంలో గాయపడిన కూలీలు



అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు


బాధితురాలికి చికిత్స అందిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: తిమ్మంపేట సమీపంలో జాతీయరహదారి నెత్తురోడింది. వ్యవసాయ కూలీలతో వెళ్తున్న బొలెరో వాహనాన్ని లారీ వెనుకనుంచి ఢీకొంది. ఈ ఘటనలో మహిళా కూలీ దుర్మరణం చెందింది. మరో 16 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదస్థలిలో రోడ్డుపై ఎగిరిపడ్డ కూలీలు రక్తగాయాలతో ఆర్తనాదాలు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం ఎగువపల్లి, కొండకింద కొట్టాల, కల్లూరుకు చెందిన దాదాపు 35 మంది కూలీలు చీనీకాయలు తొలగించే పనికి శనివారం ఉదయం కల్లూరు నుంచి బొలెరో వాహనంలో ఆత్మకూరు మండలం సిద్దరాంపురం వెళ్లారు. సాయంత్రం పని ముగించుకొని కూలీలందరూ తిరిగి బొలెరో వాహనంలో కల్లూరుకు బయల్దేరారు. తిమ్మంపేట సమీపంలోని 44వ జాతీయరహదారిపైకి వచ్చేసరికి రాత్రి అయ్యింది. ఆ సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ.. బొలెరో వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనంలో ఉన్న కొండకింద కొట్టాలకు చెందిన మహిళా కూలీ మంగమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందింది. మరో 16 మంది కూలీలు ఎగిరి రోడ్డుపై పడ్డారు. రక్షించండంటూ ఆర్తనాదాలు చేస్తుండడంతో స్థానికులు గమనించి 108,పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, 108 సిబ్బంది సంఘటన స్థలం వద్దకు చేరుకుని గాయపడిన ఎగువపల్లికి చెందిన నాగలక్ష్మి, పద్మావతి, శివమ్మ, లక్ష్మీదేవి, యశ్వంత్, పార్వతమ్మ, దేవమ్మ, ఇందిర, లక్ష్మమ్మ, గుడ్డాలపల్లికి చెందిన ఈరమ్మ, కల్లూరుకు చెందిన వరలక్ష్మి, సావిత్రి, రామలక్ష్మి, భార్గవి, భావన, సావిత్రమ్మని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో నాగలక్ష్మి, ఈరమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

కిక్కిరిసిన సర్వజనాస్పత్రి

అనంతపురం మెడికల్ : తిమ్మం పేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులతో సర్వజనాస్పత్రి కిక్కిరిసింది. క్షతగాత్రుల ఆర్తనాదాలు ఎమర్జెన్సీ వార్డులో పెద్దఎత్తున వినిపించాయి. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు సంబంధిత వైద్యులను ఆదేశించారు.



గాయపడిన మహిళా కూలీలు


ప్రమాదానికి కారణమైన లారీ

ఆ కార్యాలయంలోనే కిరికిరి!

- విద్యాశాఖ కార్యాలయంలోనే అక్రమాలు జరుగుతున్నాయంటున్న ఉపాధ్యాయులు
- ఫిర్యాదుకు ఉపాధ్యాయ సంఘాల నేతల వెనకడుగు


పదోన్నతుల కోసం సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ల బదిలీలు, పదోన్నతుల్లో అక్రమ పాయింట్ల విషయంలో వేళ్లన్నీ విద్యాశాఖ కార్యాలయం వైపే చూపిస్తున్నాయి. ఇప్పటికే హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లలో కొందరు అక్రమ మార్గాన పాయింట్లతో లబ్ధి పొందారు. తాజాగా ఎస్జీటీల్లోనూ కుప్పలుతెప్పలుగా ఇదేదారిని ఎన్నుకున్నారు. తప్పుడు పాయింట్లు పొందుతున్న వారిపై కొందరు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా వారిని అలానే కొనసాగిస్తుండడం పట్ల విద్యాశాఖ ఉద్యోగులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఫిర్యాదు చేసేందుకు ఉపాధ్యాయ సంఘాల నేతలు కూడా వెనకడుగు వేస్తున్నారు.

ఇదెట్టా.. ఇదెట్టా..

ప్రభుత్వం కొత్తగా తెచ్చిన బదిలీ చట్టం మేరకు ఒక హైస్కూల్‌లో ఒక సబ్జెక్టులో 50 శాతానికి మించి ప్రిఫరెన్షియల్ కేటగిరీ టీచర్లు ఉండకూడదు. మరి అనంతపురంలోని కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆరు ఇంగ్లిష్ పోస్టులు ఉన్నాయి. వీరిలో ఇప్పటికే ఇద్దరు ప్రిఫరెన్షియల్ కేటగిరీ టీచర్లు ఉన్నారు. తాజా బదిలీల్లో మరో ఇద్దరు ప్రిఫరెన్షియల్ కేటగిరీ టీచర్లు వచ్చారు. అంటే ఆరుగురులో నలుగురు వారే ఉన్నారు. ఇదెలా సాధ్యమో అర్థం కావడం లేదు. అందులోనూ ఓ టీచరు నిబంధనల విరుద్ధంగా ఈ కేటగిరిలోకి వచ్చాడు.

- నార్పల మండలంలో పని చేస్తున్న ఓ టీచరుకు ఎలాంటి సర్జరీ జరగలేదు. అయినా సర్జరీ చేయించుకున్నట్లు నకిలీ సర్టిఫికెట్ పొంది నగరంలోని ఓ స్కూల్‌కు వచ్చారు.
- ప్రభుత్వ యాజమాన్యాల స్కూళ్లలో పని చేస్తున్న జెడ్పీహెచ్ఎస్ టీచర్లు... తప్పనిసరి బదిలీ అయితే వారి యాజమాన్యానికే వెళ్లాలి. ఎవరైనా రిక్వెస్ట్‌గా వెళ్లాల్సి వచ్చినా వారి యాజమాన్యాలకే వెళ్లాలి, లేదంటే చివరగా తాను పని చేస్తున్న పాఠశాలకు ఆప్షన్ ఇచ్చుకోవాలి. అలాకాకుండా ఓ టీచరు రిక్వెస్ట్ బదిలీపై నగరంలోని ఓ స్కూల్‌కు వచ్చారు.
- కుందుర్పి మండలం వడ్డుపాళ్యం పాఠశాలలో పని చేసే ఓ టీచరు కాలికి శస్త్ర చికిత్స జరిగింది. 69 శాతం వరకు వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ పొందారు. ఇటీవల ఈయన వైకల్యశాతం 59 ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. అదనంగా 7 స్పెషల్ పాయింట్లు పొందారు. ఇంత వైకల్యశాతం ఉన్న వ్యక్తి క్రికెట్, ఇతర క్రీడలు బ్రహ్మాండగా ఆడతాడు. ఇదెలా సాధ్యయో ఆయనకు, సర్టిఫికెట్ ఇచ్చిన వైద్యులకు తెలియాలి. ఈ విషయంపై ఎంఈఓను వివరణ కోరగా.. ''ఆయన వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ పొందుపరిచాడు కానీ క్రికెట్ బాగా ఆడతాడు. ఇది ఆశ్చర్యమే''నంటూ పేర్కొన్నారు.
- కళ్యాణదుర్గం మండలంలో పని చేస్తున్న పీఎస్ టీచరు స్టేషన్ పాయింట్లు అక్రమంగా వేసుకున్నాడంటూ స్వయంగా ఎంఈఓ తన లాగిన్‌లో తొలగించి డీఈఓ దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఏం జరిగిందో కానీ మండలంలో తొలగించిన పాయింట్లు జిల్లాలో యాడ్ అయ్యాయి. ఆ పాయింట్లతో సదరు టీచరు కాలువపల్లికి కోరుకుని బదిలీ అయ్యారు.
- విడపనకల్లు మండలంలో పని చేస్తున్న ఓ మహిళా టీచరు భర్త... ధర్మవరం రూరల్ పరిధిలోని ఓ స్కూల్‌లో పని చేస్తూ గతనెల 31 రిటైర్డ్ అయ్యారు. ఈమె నిబంధనలకు విరుద్ధంగా దరఖాస్తులో స్పౌజ్ పాయింట్లు వేసుకున్నారు. తర్వాత ఆమె ఆలోచించి స్పౌజ్ పాయింట్లు తొలగించాలంటూ అర్జీ పెట్టుకున్నారు. ఈ క్రమంలో తాత్కాలిక జాబితాలో తొలగినా ఫైనల్ సీనియార్టీ జాబితాలో మళ్లీ ఆ పాయింట్లు కనిపించాయి. ఇదెలా సాధ్యం అని టీచర్లు ప్రశ్నిస్తున్నారు. ఆరోపణలు రావడంతో మళ్లీ ఆ పాయింట్లను తొలగించాల్సి వచ్చింది.

విద్యుత్ షాక్‌తో కాంట్రాక్ట్ కార్మికుడికి తీవ్రగాయాలు

గుంతకల్లు: పట్టణంలోని డీ–1 కార్యాలయంలో పోల్ టు పోల్ కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్న మస్తాన్‌వలి విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. శనివారం పాతగుంతకల్లులోని బీసీ హాస్టల్ సమీపాన విద్యుత్ స్తంభాల్లో ఏర్పడిన విద్యుత్ సమస్యను పరిష్కారించడానికి లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుతో మస్తాన్‌వలి ఎల్‌సీ తీసుకున్నాడు. అనంతరం పోల్ ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో మస్తాన్‌వలి కుడి చేతి రెండు వేళ్ల తెగిపోగా.. కుడి కాలుకు పెద్ద గాయమైంది. వెంటనే అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఏడీ నాగేంద్ర మస్తాన్‌వలిని పరామర్శించి ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

పోల్ టు పోల్ కాంట్రాక్ట్ కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మస్తాన్‌వలిని వారు పరామర్శించారు.

బాలికపై అత్యాచారం అమానుషం


మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం అర్బన్: రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికపై జరిగిన అత్యాచారం అమానుషమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ అన్నారు. శనివారం అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఘటనకు కారణమైన వారు ఏ పార్టీకి చెందినవారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత బాలిక కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. పేదరికాన్ని, సామాజిక వెనుకబాటును అవకాశంగా తీసుకుని దళిత బాలికపై ఆరు నెలలుగా 14 మంది అత్యాచారానికి పాల్పడడం సభ్య సమాజానికే సిగ్గుచేటన్నారు. నిస్సహాయ బాధిత బాలికకు అండగా నిలవాల్సిన సమయంలో ప్రధాన రాజకీయ పార్టీలు విమర్శలు చేసుకోవడం నిందితులకే తోడ్పుతుందనే విషయం గుర్తించాలన్నారు. ఈ దుర్మార్గ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. దోషులకు కఠిన శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఆర్డీటీ లైసెన్స్ పునరుద్ధరించేదాకా పాదయాత్ర


యాటకల్లులో పాదయాత్రకు ఘన స్వాగతం


మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

- ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రలో మాజీ ఎంపీ తలారి రంగయ్య

శెట్టూరు: పేదల కోసం పాటుపడే రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కి లైసెన్స్ పునరుద్ధరించిన రోజే తాను పాదయాత్ర విరమిస్తానని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య స్పష్టం చేశారు. ఆయన చేపట్టిన ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర శనివారం శెట్టూరు మండలంలో కొనసాగింది. యాటకల్లులో పాదయాత్రకు మహిళలు, ప్రజలు, ఆర్డీటీ లబ్ధిదారులు ఘన స్వాగతం పలికారు. కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పాదయాత్రకు మద్దతునిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో తలారి రంగయ్యా మాట్లాడారు. అట్టడుగు వర్గాల ప్రజలకు ఆర్థిక చేయూత.. సామాజిక గుర్తింపు, ఉచితంగా ఉన్నత చదువులు, వైద్య సేవలు, గృహ నిర్మాణాలు, వ్యవసాయాభివృద్ధికి ఆర్డీటీ ఎంతగానో తోడ్పాటునందిస్తోందన్నారు. అలాంటి ఆర్డీటీకి విదేశీ నిధులు రావడం ఆగిపోతే ట్రస్టు సేవలు నిలిచిపోతాయని, అప్పుడు పేదలు మరింత దుర్భర బతుకులు వెళ్లదీయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా భయపడేది లేదన్నారు. ఆర్డీటీకి నిధులు కొనసాగేలా ఉత్తర్వులు ఇచ్చిన రోజు ధన్యవాదాలు తెలిపి తన పాదయాత్ర విరమిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, నాయకుడు మాదినేని ఉమా మహేశ్వర నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, మండల కన్వీనర్ ఎంఎస్ రాయుడు, ఎంపీపీ సోమనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామభీమప్ప, వైస్ ఎంపీపీ ముత్యాలు, చెవుల కిష్టప్ప, పార్టీ అనుబంధ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగాతో మెరుగైన ఆరోగ్యం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఎంవైఆర్ కళ్యాణ మండపంలో జిల్లా పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ.. మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లతో అనేక రకాల ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో యోగాతో చక్కని ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. యోగాతో పాటు మన సంస్కృతి, సాంప్రదాయాల గురించి భవిష్యత్తు తరాలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. రోజూ యోగా చేయడం వలన సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటూ హాస్పిటల్‌కు వెళ్లే పని తగ్గుతుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాంధ్ర కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకుని ఈనెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ గురుస్వామి శెట్టి, ఆయుష్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ భాస్కర్, డాక్టర్ లాల్యా నాయక్, ఈషా ఫౌండేషన్ స్వామీజీ దక్షరి, యోగా గురువులు కృష్ణవేణి, గురు రాజారావు, అనంతపురం రూరల్ ఎంపీడీఓ దివాకర్, పంచాయతీరాజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాల కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు



పాల కేంద్రంలో తనిఖీలు చేస్తున్న ఏడీ రవి, వ్యవసాయశాఖ అధికారులు

అనంతపురం సెంట్రల్: పాలు, పదార్థాల్లో కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏడీ రవి హెచ్చరించారు. పాడి పశువులకు అందించే దాణా, పాల పదార్థాల్లో యూరియా కల్తీ జరుగుతోందని వచ్చిన ఫిర్యాదుల మేరకు కలెక్టర్ ఆదేశాలతో శనివారం తనిఖీలు చేపట్టారు. ఆత్మకూరు మండల కేంద్రంలో జై జవాన్.. జై కిసాన్ పౌల్ట్రీ కేంద్రం, పీఎస్ఆర్ అనిమల్ ఫీడ్స్, అనంతపురం నగర శివారులో గాయత్రి మిల్క్ డెయిరీ, అరుణ పశువుల దాణా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా చర్యలు ఉంటాయని వివరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శశికళ, సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు



డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్న పోలీసులు

అనంతపురం: బక్రీద్ పండుగను పురస్కరించుకుని శనివారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. మసీదులు, ప్రార్థనా స్థలాలు, ఆయా పరిసరాల్లో పోలీసులు డ్రోన్లతో నిఘా పెంచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను సులభతరం చేశారు.

బక్రీద్ సందడి

అనంతపురం కల్చరల్/రాప్తాడు/ఆత్మకూరు: అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాల్లో శనివారం బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు ఈద్గా మైదానాల్లో సామూహిక ప్రార్థనలు జరిగాయి. రాప్తాడులోని 44వ జాతీయ రహదారి సమీపంలోని ఈద్గా మైదానంలో అనంతపురానికి చెందిన మౌలానా అబ్దుల్ జబ్బర్ సాబ్ ప్రార్థనలను ప్రారంభించారు. బక్రీద్ పర్వదిన విశిష్టతను వివరించారు. హజరత్ ఇబ్రహీం చేసిన మహోన్నత త్యాగం మానవాళికి గొప్ప సందేశాన్ని అందించిందని తెలిపారు. ఇస్మాయిల్ జ్ఞాపకార్థం వారి త్యాగ నిరతిని గుర్తు చేసుకోవడం అందరి బాధ్యత అని గుర్తు చేశారు. అన్ని మతాల మధ్య సయోధ్య, సహకార భావనను బక్రీద్ తెస్తుందన్నారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఖుర్బానీని ప్రారంభించి బంధువులు, మిత్రులకు మాంసాహారం పంచిపెట్టారు. ఆత్మకూరులోని నూరియా జామియా మసీదు నుంచి ముస్లింలు భారీగా ఈద్గా మైదానానికి తరలి వెళ్లారు. హజరత్ సయ్యద్ షబ్బీర్ బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. నమాజ్ అనంతరం సయ్యద్ సర్దార్‌వలి దర్గా దగ్గరికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే ముట్టాల, సనప, తోపుదుర్తి, బి.యాలేరు, మదిగుబ్బ గ్రామాల్లో కూడా బక్రీద్ సందడి నెలకొంది.



అనంతపురంలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



ఆత్మకూరులో దువా చదువుతున్న హజరత్ సయ్యద్ షబ్బీర్



ఈద్గా మైదానంలో వజూ చేస్తున్న ముస్లింలు



ప్రార్థనల్లో ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీం అహ్మద్, తదితరులు



ఈద్గా మైదానానికి వెళ్తున్న ముస్లింలు

రక్తదాతలతోనే ఆరోగ్యకర సమాజం



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: రక్తదాతలతోనే ఆరోగ్యకర సమాజం ఏర్పాటువుతుందని మేయర్ వసీం సలీం అన్నారు. శనివారం బక్రీద్ సందర్భంగా నజీర్ బ్లడ్ డోనర్స్ కమిటీ ఆధ్వర్యంలో వేర్వేరు చోట్ల రక్తదాన శిబిరం జరిగింది. స్థానిక షాహీ ఈద్గా మైదానం వద్ద 87 మంది, హెచ్చెల్సీ కాలనీలో బావుద్దీన్ ఈద్గా వద్ద 45 మంది రక్తదానం చేశారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీం అహ్మద్, మార్కెట్‌యార్డు ఫయాజ్, మానవతా రక్తదాతల సంస్థ కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి, కో–కన్వీనర్ సలీం మాలిక్ తదితరులు మాట్లాడారు. గత 27 ఏళ్లగా సలీం మాలిక్, నజీర్, ఆయన కుమారుడు మహబూబ్‌బాషా, వారి మిత్ర బృందం ప్రతి బక్రీదు రోజున రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ షంషుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు తానీషా, కాకర్ల శీన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తాంజనేయుడికి పూజలు

అనంతపురం కల్చరల్: నగరంలోని సద్గురు వలీ స్వామి ఆశ్రమంలో కొలువైన భక్తాంజనేయ స్వామికి శనివారం జేష్ఠ్యద్వాదశి సందర్భంగా వడ మాలలతో విశేష పూజలు చేశారు. ఆశ్రమ నిర్వాహకులు దేవనూరు విజయ్‌కుమార్ నేతృత్వంలో స్వామికి 324 వడలతో అలంకార సేవలు అనంతరం వాటిని భక్తులకు వితరణ చేశారు. సామూహిక హనుమాన్ చాలీసాను భక్తిశ్రద్ధలతో పఠించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ జరిగింది.

పొట్ట కూటి కోసం..



నగరంలోని ఈద్గా మైదానం వద్ద శనివారం ఓ ఇద్దరు ప్రమాదకర విన్యాసాలు చేశారు. ఒకరు భుజాలపైకి ఎక్కి నిలబడగా.. మరొకరు ఆ వ్యక్తిని మోస్తూ అలాగే నిలబడ్డారు. భుజాలపై నిలబడిన వ్యక్తి కిందకి, పైకి ఎగురుతూ విన్యాసం చేశాడు. నమాజ్ కోసం వస్తున్న వారిని పలకరిస్తూ దానం చేయాలని వేడుకున్నారు. అయ్యో.. పొట్ట కూటి కోసం యువకులు పడుతున్న కష్టాన్ని చూసి చలించిన పలువురు తమకు తోచిన విధంగా ఆర్థికసాయం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

నూతన పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

రాప్తాడు: ఖరీఫ్ సీజన్‌లో రైతులు నూతన వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని శాస్త్రవేత్తలు సూచించారు. 'వికసిత్ కృషి సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని ఎం.బండమీదపల్లి, మరూరు గ్రామాల్లో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పర్యటించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగులో తీసుకోవాల్సిన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. బుక్కరాయసముద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి, రేకులకుంట లైవ్ స్టాక్ రీసర్చ్ స్టేషన్ శాస్త్రవేత్తలు డాక్టర్ శశికళ, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ రవి కిరణ్, డాక్టర్ రఘు కరణ్ మాట్లాడారు. ప్రస్తుతం అధిక మోతాదులో ఉపయోగించే ఎరువులు, పురుగు మందులకు స్వస్తి చెప్పి పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంటల సాగులో నూతన పద్ధతులు, వంగడాలు, డ్రోన్ స్ప్రేయింగ్ ఇతర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనువైన విత్తనాలు, రకాలు, వాతావరణ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు పాటించడం, తక్కువ మందుల పిచికారీ తదితర అంశాలు అధిక దిగుబడులపై ఆధారపడి ఉంటాయన్నారు. పంట సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులు వేయడం ద్వారా భూసారం పెరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ శ్రీవాణి, టెక్నికల్ అసిస్టెంట్ ఆంజనేయ రెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది నవ్య, నరేష్ బాబు, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

మ్యానువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలి



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) బదిలీల కౌన్సెలింగ్ మ్యానువల్‌గా చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక శారదా నగర పాలక బాలికల ఉన్నత పాఠశాలలో డీఈఓ ఎం.ప్రసాద్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ.. ఎంఈఓ కార్యాలయాలకు టీచర్లను పిలపించి వెబ్ ఆప్షన్లు ఇప్పించేలా చూస్తున్నారన్నారు. ప్రభుత్వ నిర్ణయం మార్చుకోకపోతే ఆదివారం డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఎస్జీటీల గ్రీవెన్స్ పరిష్కారం తర్వాతనే కౌన్సెలింగ్ జరపాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఏ ఎస్.నాగిరెడ్డి, ఆప్టా గోపాల్‌రెడ్డి, పీఆర్టీయూ విష్ణువర్ధన్ రెడ్డి, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఏపీటీఎఫ్ (1938) శ్రీనివాస నాయక్, ప్రసాద్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, యూటీఎఫ్ గోవిందరాజులు, లింగమయ్య, ఎస్టీయూ రమణారెడ్డి, రామాంజనేయులు, ఆపస్ ఎర్రిస్వామి, ఏపీటీఎఫ్ సూర్యనారాయణ, ఎస్ఎల్‌టీఏ శ్రీనివాసులు, శివానందరెడ్డి, గిరిజన ఉపాధ్యాయ సంఘం శివయ్య, రవీంద్రనాయక్, ఎస్టీఏ జయరాం నాయక్, ఆర్జేయూపీ రామాంజనేయులు, పీహెచ్ఎంఏ మర్రిస్వామి పాల్గొన్నారు.

ఐక్యతతోనే బ్రాహ్మణుల సంక్షేమం



జెండా ఎగురవేస్తున్న బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు

అనంతపురం కల్చరల్: ఏపీబీఎస్ఎస్ (ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం) ఏర్పడి 41 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం వేణుగోపాల నగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. సంఘం రాష్ట్ర అడ్వైజరీ డైరెక్టర్ అలూరు లక్ష్మీనరసింహ శాస్త్రి ఆధ్వర్యంలో పతాక ఆవిష్కరణ జరిగింది. అనంతరం సాగిన సమావేశంలో ఏఎల్ఎన్ శాస్త్రితో పాటూ జిల్లా అధ్యక్షుడు మురళీధర్, ప్రధాన కార్యదర్శి కరణం రామసుబ్బారావు తదితరులు మాట్లాడారు. బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్యను అభివృద్ధి పథంలో నడిపేందుకు సభ్యులు తమ వంతు కృషి చేయాలని సూచించారు. బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని పేర్కొన్నారు. ముఖ్యంగా సమాజంలో బ్రాహ్మణుల పునఃవైభవం గురించి చర్చ జరిగింది. స్మార్త, మధ్వ, శ్రీవైష్ణవ వంటి శాఖా బేధాలు మరచి అందరం ఒక్కటిగా సాగాలని పిలుపునిచ్చారు. ఈనెల 22న రాయలసీమ స్థాయి సమావేశం నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ మారుతి, సత్యనారాయణ, జోషి, గొల్లపల్లి లక్ష్మి నరసింహులు, హోసూరు రామసుబ్రమణ్యం, కొనగంచి మురళీ, చంద్రకాంతారావు, శేషయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శిగా రవికుమార్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత , వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అనంతపురం నగర కార్యదర్శిగా పసుపులేటి రవికుమార్ రాయల్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

నిందితులను కఠినంగా శిక్షించాలి

అనంతపురం టవర్‌క్లాక్: దళిత మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని వక్తలు డిమాండ్ చేశారు. శనివారం ఆర్ట్స్ కాలేజీలో వివిధ కుల, ప్రజాసంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిజ నిర్ధారణ కమిటీగా ఏర్పడి సోమవారం రామగిరి మండలం ఏడు గుర్రాల పల్లి గ్రామాన్ని సందర్శించాలని తీర్మానించారు. బాలికకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కుటుంబానికి అన్ని విధాలా రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో నిజనిర్ధారణ కమిటీ సభ్యులు శంకర కుళ్లాయప్ప, సాకే హరి, శ్రీరాములు, ఓబులేసు, శ్రీనివాసులు, కేపీ రాజు, దావీదు, గోవర్ధన్ పాల్గొన్నారు.



'విద్యా'నగరంగా 'అనంత'

- విస్తృతంగా విస్తరిస్తున్న ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలు
- అందుబాటులో నాణ్యమైన విద్య
- విద్యాభ్యాసం కోసం విదేశీయుల మొగ్గు

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం నగరం 'విద్యా'నగరంగా మారుతోంది. నగరంతో పాటు రూరల్ మండలంలో పెద్ద ఎత్తున విద్యా సంస్థలు విస్తరించాయి. ప్రభుత్వ విద్యాలయాలతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలు, డిగ్రీ, పీజీ కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. కేజీ నుంచి పీజీ వరకు కోర్సులు నిర్వహిస్తున్న విద్యా సంస్థలు చాలానే ఉన్నాయి. నాణ్యమైన ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నారు. మరో వైపు స్కూళ్లు, కళాశాలలో అధునాతన సౌకర్యాలు కల్పించారు. సువిశాలమైన తరగతి గదులు, భోజన శాలలు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలను ఉత్తమ ప్రమాణాలతో ఏర్పాటు చేశారు. కంప్యూటర్ ల్యాబ్స్ అందుబాటులో ఉన్నాయి. వందలాది ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు ఉన్నాయి. పదుల సంఖ్యలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటయ్యాయి. చాలా విద్యాసంస్థల్లో బాల బాలికలకు వేర్వేరుగా హాస్టళ్ల వసతి కల్పించడం జరుగుతోంది. బాలికలకు పూర్తిగా రక్షణగా ఉంటున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా చాలామంది పిల్లలు ఇక్కడికి వచ్చి చదువుకుంటున్నారు. అనంతపురం నగరం ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతోందని విద్యావేత్తలు చెబుతున్నారు. మరోవైపు నగరానికి అతీ సమీపంలోనే కేంద్రియ విద్యాలయం కూడా అందుబాటులో ఉంది. ఇక్కడికి దేశం నలుమూలల నుంచే కాకుండా ఇతర దేశాల విద్యార్థులు చదువుకునేందుకు వస్తున్నారు. అలాగే జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ, జేఎన్‌టీయూ యూనివర్సిటీల్లో ఏటా అడ్మిషన్లు పెరుగుతున్నాయి. సమీపంలోని కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల నుంచి విద్యార్థులు విద్యాభ్యాసం కోసం వస్తున్నారు. గతంలో మన జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు చదువు నిమిత్తం వలసలు వెళ్లేవారు. ఇప్పుడు ఇతర ప్రాంతాల వారు ఇక్కడ రావడం గమనార్హం.